## మావోయిస్టు అగ్రనేత

# నంబాల కాల్చివేత



> మొదటిపేజీ తరువాయి...

మంగళవారం నుంచి సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పుల జరిపారు. వెంటనే అప్రమత్తమైన సాయుధ బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువర్గాల మధ్య సుమారు మూడు గంటలపాటు జరిగిన భీకర పోరులో జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్న భద్రతా బలగాలు ఘటనా స్థలం నుంచి 27 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ గంగన్న అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ అలియాస్ ప్రకాశ్ అలియాస్ కృష్ణ అలియాస్ విజయ్(70)తోపాటు 27 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. అలాగే 'అవామ్-ఐ-జంగ్' ఎడిటర్, 31 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న నేత, మాడ్ ఏరియా డివిజన్ ప్రెస్ యూనిట్ సభ్యుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ రాజన్న అలియాస్ యేసన్న అలియాస్ నవీన్ సైతం మృతి చెందినవారిలో ఉన్నారు. డీఆర్‌జీ జవాన్ తోపాటు మరో సభ్యుడు మృతిచెందగా.. మరికొందరు జవాన్లు గాయపడ్డట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. 2018లో నంబాల కేశవరావు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాక అనేక తీవ్రమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటి నుంచి ఛత్తీస్‌గఢ్ అడవుల్లో వరుస మారణకాండలు జరిగినట్లు చెప్పుకోవచ్చు. కేశవరావు నేతృత్వంలో పీఎల్‌జీఏ మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసింది. ప్రస్తుతం బసవరావు మృతితో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలకు బ్రేక్ పడ్డట్లేనని భావిస్తున్నారు.

**కేంద్రం వ్యూహాత్మక అడుగులు**

అబూజ్‌మాడ్ అడవులను కేంద్రంగా చేసుకున్న మావోయిస్టు పార్టీ కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం వ్యూహాత్మకంగా పావులు కదిపింది. ఇందులో భాగంగానే నెల రోజుల 'హైడ్రామా' అనంతరం



మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వంపై పంజా విసిరింది. అబూజ్‌మాడ్ ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 27 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన భారీ ఆయుధ, వస్తు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో ఇంకొందరు ముఖ్య నేతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. మిగతా వారి వివరాలను అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఒబాల కేశవరావుపై ఛత్తీస్‌గఢ్, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రూ.5 కోట్లకు పైగానే రివార్డు ఉంది. తాజా ఘటనను కూడా కలుపుకుంటే ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 200 మంది నక్సలైట్లు మరణించారు. వీరిలో 183 మంది బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో మృతిచెందారు.

### భద్రతా దళాలను చూసి గర్విస్తున్నా: మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది నక్సలైట్లను అంతం చేసిన మన భద్రతా దళాలను చూసి గర్వపడుతున్నానని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం తెలిపారు. ఈ గణనీయమైన విజయాన్ని సాధించిన మన భద్రతా దళాల పట్ల గర్విస్తున్నానని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. మావోయిజం బెడదను నిర్మూలించాలని తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ప్రజలకు శాంతి, అభివృద్ధిని అందచేయడమే తమ ధ్యేయమని మోదీ తెలిపారు.

### ఇది చారిత్రక విజయం: అమిత్ షా

ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం భద్రతాదళాల జరిపిన ఎదురుకాల్పులలో మరణించిన 27 మంది నక్సలైట్లలో నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న సీపీఐ-మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. నక్సలిజానికి వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా సాగుతున్న యుద్ధంలో మొట్టమొదటిసారి ప్రధాన కార్యదర్శి ర్యాంకు ఉన్న నాయకుడిని భద్రతా దళాలు అంతం చేశాయని ఎక్స్ వేదికగా షా పేర్కొన్నారు. నక్సలిజాన్ని అంతం చేసేందుకు సాగుతున్న యుద్ధంలో నేడు ఓ చారిత్రక విజయాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో మావోయిస్టు అగ్రనేత, నంబాల కేశవరావుతోసహా 27 మంది నక్సలైట్లు మరణించారని ఆయన పేర్కొన్నారు. ఈ భారీ విజయాన్ని సాధించినందుకు భద్రతా దళాలు, ఏజెన్సీలను ఆయన అభినందించారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిందని, 54 మంది నక్సలైట్లను అరెస్టు చేయగా 84 మంది నక్సల్స్ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో లొంగిపోయారని హోం మంత్రి వెల్లడించారు. 2026 మార్చి 31వ తేదీ లోపల నక్సలిజాన్ని అంతం చేయాలన్న సంకల్పంతో మోదీ ప్రభుత్వం ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

# మెరుపుదాడుల వ్యూహకర్త

# నంబాల



## ఆర్‌ఎస్‌యూ నుంచి మావోయిస్టు కెప్టెన్ దాకా ప్రస్థానం

### మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ చీఫ్‌గా అనేక మెరుపు దాడులు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. నక్సల్ ఉద్యమంలో సాధారణ కార్యకర్తగా చేరిన నంబాల మావోయిస్టు పార్టీలో అత్యున్నతమైన ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టే స్థాయికి ఎదిగారు. ఆర్‌ఎస్‌యూలో క్రియాశీలకార్యకర్తగా వ్యవహరించిన నంబాల 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. ఆయన 2018 నుంచి మావోయిస్టు పార్టీకి జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి మృతిచెందడం ఇదే ప్రథమం. శ్రీకాకుళం జయ్యన్నపేటలో మొదలైన నంబాల జీవితం ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో పరిసమాప్తమైంది. జయ్యన్నపేట నుంచి వరంగల్ ఆర్‌ఈసీ మీదుగా అజ్ఞాతంలోకి వెళ్లిన నంబాల ప్రస్థానం ఇది.

**అజ్ఞాతబాట**

శ్రీకాకుళం జిల్లా జయ్యన్నపేటలో 1955లో జన్మించిన నంబాల కేశవరావు వరంగల్ ఆర్ఈసీ (నిట్)లో ఎంటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) చదువుతున్నప్పుడే ఆర్‌ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)లో చురుకైన పాత్ర పోషించారు. కాలేజీలో ఏబీవీపీ, ఆర్‌ఎస్‌యూ మధ్య సైద్ధాంతిక విభేదాలు, ఘర్షణలు, దాడులు, ప్రతిదాడులు కొనసాగేవి. అలా ఒకసారి ఏబీవీపీ విద్యార్థులపై జరిగిన దాడిలో నంబాలపై కేసు నమోదైంది. పోలీసుల వేధింపులు, నిత్యఘర్షణలు ఎక్కువ కావడంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే, వరంగల్‌లో ఆర్‌ఈసీ విద్యార్థిగా ఉన్నప్పుడు హమాలీల కష్టాలు తెలుసుకునేందుకు ఆయన రాత్రిపూట హమాలీగా పనిచేశారు.

**మారుపేర్లతో మనుగడ**

తల్లిదండ్రులు పెట్టిన పేరు కన్నా ప్రజలు ఇష్టంగా పిలుచుకునే పేరుతోనే ఉద్యమకారులు ప్రాచుర్యం అవుతారు. అలా సుదీర్ఘ ఉద్యమ జీవితంలో నంబాలకు ఎన్నిపేర్లు ఉన్నాయో లెక్కలేదంటారు. పోలీసు రికార్డుల ప్రకారం నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు చిరపరిచితమైంది. ఇంకా గగన్న, గంగన్న, ప్రకాశ్, కృష్ణ, విజయ్, ఉమేశ్, రాజు, కామ్లూ ఇలా అనేక పేర్లతో ఆయనను పిలిచేవారని అధికారవర్గాలు తెలిపాయి.

**ఈస్ట్ డివిజన్ నుంచి మావోయిస్టు సుప్రీం కమాండర్ దాకా**

కొండపల్లి సీతారామయ్య (కేఎస్) నాయకత్వంలో పురుడుపోసుకున్న పీపుల్స్‌వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) తొలితరం నాయకుల్లో నంబాల ఒకరు. గణపతి, కిషన్‌జీ, మల్లా రాజిరెడ్డి మొదలైనవాళ్లు మొదటి బ్యాచ్ అయితే, నంబాల సెకండ్ బ్యాచ్‌కు చెందినవారు. నంబాల ఈస్ట్ డివిజన్ (తూర్పుగోదావరి నుంచి విశాఖపట్నం మీదుగా ఒడిశా దాకా) నుంచి అజ్ఞాతజీవితం మొదలైంది. ఈస్ట్ డివిజన్ మొదటి దళం సభ్యుడిగా, దళకమాండర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడి (డీసీఎస్)గా, జిల్లా కార్యదర్శి (డీసీ)గా, స్టేట్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. అక్కడి నుంచి డీకే (దండకారణ్య కమిటీ) కార్యదర్శిగా వ్యవహరించారు. 1991లో పీపుల్స్‌వార్ నుంచి కొండపల్లి సీతారామయ్య నిష్క్రమణ తరువాత నంబాల కేశవరావు 1992లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) సభ్యుడయ్యారు. సీసీ మెంబర్‌గా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మావోయిస్టు దళపతి ముప్పాళ లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి తరువాత నెంబర్ 2 స్థానానికి ఎదిగారు. మావోయిస్టు పార్టీలో అత్యున్నతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) చీఫ్‌గా వ్యవహరించారు. 25 ఏండ్లపాటు ఇటు పీపుల్స్‌వార్‌కు, అటు మావోయిస్టు పార్టీకి నాయకత్వం వహించిన గణపతి అనారోగ్య కారణాల రీత్యా మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ పదవికి రాజీనామా చేశారు. దీంతో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ నంబాల కేశవరావును 2018లో ఆ స్థానానికి ఎన్నుకున్నది.

**ఆదివాసీలకు బాసటగా**

ఈస్ట్ డివిజన్‌లో నంబాల పనిచేస్తున్న కాలంలో ఆ ప్రాంతంలోని జంగ్లాత్‌వాళ్ల (అటవీ అధికారుల) దౌర్జన్యాలు, పెత్తందారులు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా కోంద్, కొండరెడ్ల (ఆదివాసీ తెగలు) పోరాటం సాగింది. ఈ పోరాటానికి నంబాల నాయకత్వం వహించి మన్నెంవీరుడిగా గుర్తింపు పొందారు. ఆ సమయంలోనే కోంద్, కొండరెడ్డి తెగలకు చెందిన యువతను విప్లవోద్యమంవైపు నడిపించారు. అలా రిక్రూట్‌మెంట్ స్పెషలిస్ట్‌గా నంబాలకు మావోయిస్టు పార్టీలో పేరొచ్చింది.

### నేషనల్ వాలీబాల్ ప్లేయర్

అజ్ఞాత జీవితంలోకి వెళ్లకముందు నంబాల వాలీబాల్ ప్లేయర్‌గా రాణించారు. ఉమ్మడి రాష్ట్ర వాలీబాల్ జట్టు నుంచి నేషనల్స్ కూడా ఆడారు. అంతకుముందు ఆయన కాకతీయ యూనివర్సిటీ కబడ్డీ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. మహారాష్ట్రలోని అకోలాలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో ఆయన కేయూకు ప్రాతినిధ్యం వహించారు. ఆంధ్రా యూనివర్సిటీలో బీ.టెక్ చదివిన నంబాల వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీ (ఆర్‌ఈసీ)లో కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశారు.



నాటి ఆర్‌ఈసీ ప్రిన్సిపల్, విద్యార్థులతో నంబాల (ఫైల్)

**కోరాపుట్ దాడిలో..**

ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌పై మావోయిస్టులు మెరుపుదాడి చేసి ఆయుధాలను కొల్లగొట్టారు. కొల్లగొట్టిన ఆయుధాలను లారీలో తరలించారని, ఆ దాడికి నాయకత్వం వహించింది నంబాల కేశవరావేనని పోలీసు రికార్డులు చెప్తున్నాయి.

- 1995లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఏర్పాటులో, పీపుల్స్ గెరిల్లా ఆర్మీ (పీజీఏ), 2004లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పాటులో నంబాలది నాయకత్వ పాత్ర. గెరిల్లా ఆర్మీకి కమాండర్‌గా ఉమ్మడి ఏపీ, బీహార్, జార్ఖండ్, దండకారణ్యంలో సైద్ధాంతిక, సైనిక చర్యల నిర్వహణలో శిక్షణ ఇచ్చారు.
- పీపుల్స్‌వార్ 2001లో ఏర్పాటుచేసిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ)కు నంబాల చీఫ్‌గా వ్యవహరించారు. పీపుల్స్‌వార్, ఎంసీసీ గ్రూపులు 2004లో విలీనమై సీపీఐ మావోయిస్టుగా రూపాంతరం చెందినా సీఎంసీకి నంబాలే చీఫ్‌గా కొనసాగారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, సీఎంసీ చీఫ్‌గా ఆయన పలు కీలక హోదాలను నిర్వహిస్తూనే రిక్రూట్‌మెంట్, యాక్షన్ అనే భిన్న పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలకు చోదకశక్తిగా వ్యవహరించారు.
- 2003లో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబుపై అలిపిరిలో జరిగిన దాడిలో సూత్రధారి, తాజాగా ఏపీలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోములపై దాడికి వ్యూహకర్త కూడా నంబాలే అని పేర్కొంటారు.
- 2010లో ఛత్తీస్‌గఢ్‌లో 76 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రయాణిస్తున్న వాహనంపై దాడికి వ్యూహకర్త నంబాల అని పోలీసు రికార్డులు చెప్తున్నాయి.
- మావోయిస్టు ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్, దండకారణ్య ఫారెస్ట్ డివిజన్, పార్టీ స్టాండింగ్ కమిటీ, ఎడిటోరియల్ బోర్డు (జంగ్) బాధ్యతలకు నంబాలే దిక్సూచి.

### మావోయిస్టు పార్టీకి మూలస్తంభం

నంబాల కేశవరావును మెరుపుదాడుల వ్యూహకర్తగానే కాకుండా సృష్టికర్తగా కూడా పిలుస్తారు. పీపుల్స్‌వార్ పార్టీ ఎమర్జెన్సీ (1975-77), ఎమర్జెన్సీ అనంతర కాలంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నది. 'అన్న'లపై ఆశలు సన్నగిల్లుతున్న కాలంలో, ఉద్యమం వెనకపట్టు పడుతున్నదనుకున్న సమయంలో దేశ విప్లవోద్యమ చరిత్రనే మలుపు తిప్పిన అంబుష్ (మెరుపుదాడులు) ఘటనలు చోటుచేసుకున్నాయి. అందులో ఆదిలాబాద్ జిల్లా ఆలంపల్లి ఒకటైతే, ఈస్ట్ డివిజన్‌లో దారగడ్డ (దారకొండ) అంబుష్ రెండోది. ఒకదానికి సాగర్ నాయకత్వం వహిస్తే, రెండో దానికి నంబాల నాయకత్వం వహించారు. ఈ రెండు వరుస ఘటనలు మావోయిస్టు ఉద్యమం (పీపుల్స్‌వార్) పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని, పార్టీ క్యాడర్‌లో నైతిక స్థైర్యాన్ని నింపాయని చెప్తారు. మెరుపు వ్యూహకర్తగా పేరున్న నంబాల అదే మెరుపు వ్యూహంతో 1986లో తప్పించుకున్నారు. ఈస్ట్ డివిజన్ కార్యదర్శిగా ఉన్నప్పుడు ఎస్‌టీఎఫ్ పోలీసులు ఆయనను గాయపరచి అరెస్టు చేసి వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న తరుణంలో వారి దగ్గరి నుంచి ఆయుధం గుంజుకొని ఫైర్‌చేస్తూ తప్పించుకున్నారు. గెరిల్లా యుద్ధం, ఐఈడీ పేలుడు పదార్థాల వినియోగంలో మావోయిస్టు పార్టీకి నంబాల మూలస్తంభం.



అలిపిరిలో జరిగిన మావోయిస్టుల దాడిలో ధ్వంసమైన కారు

# నరమేధం



*ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్రం ఉద్ధృతంగా సాగిస్తున్నది. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 200 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్లు తరచూ జరుగుతున్నాయి.*

**జనవరి 4:** అబూజ్‌మఢ్, జంగ్లా అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు.

**జనవరి 9 :** సుక్మా-బీజాపూర్ సరిహద్దుల్లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోల ఎన్‌కౌంటర్

**జనవరి 12 :** బీజాపూర్, మెహ్దాలో ఐదుగురు మావోల మృతి

**జనవరి 16 :** ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో పూజారి గ్రామం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో తెలంగాణ రాష్ట్ర కమిటీ నేత దామోదర్ కూడా ఉన్నారు.

**జనవరి 19 :** ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్ర నేత రామచంద్ర రెడ్డి సహ 14 మంది మరణించారు.

**జనవరి 21:** గరియాబంద్‌లో 14మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్. వీరిలో సెంట్రల్ కమిటీ సభ్యుడు జైరామ్ (చలపతి)ఉన్నారు.

**ఫిబ్రవరి 2 :** బీజాపూర్, గంగలూరులో 8 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

**ఫిబ్రవరి 9 :** మెహ్దా-ఫార్సెగఢ్ సరిహద్దులో 31 మంది మావోయిస్టులు మృతి

**మార్చి 20 :** బీజాపూర్‌లో 26 మంది, కాంకేర్‌లో నలుగురు మావోల మృతి

**మార్చి 25 :** దంతెవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో ముగ్గురు మావోల మృతి.

**మార్చి 29:** సుక్మా-దంతెవాడ సరిహద్దుల్లో 11మంది మహిళలు సహా 16 మంది మృతి. వీరిలో సీనియర్ మావోయిస్టు నేత కుధమి జగదీశ్ ఉన్నారు.

**మార్చి 31 :** దంతెవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ మహిళా మావోయిస్టు కమాండర్ మృతి. ఆమెపై రూ.45 లక్షల రివార్డు

**ఏప్రిల్ 21:** జార్ఖండ్‌లోని బొకారోలో 8 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో వివేక్‌పై కోటి రివార్డు

**ఏప్రిల్ 25:** బీజాపూర్ అడవుల్లో ఐదుగురు మావోల ఎన్‌కౌంటర్

మే 12: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో 31 మంది మావోయిస్టుల మృతి



### న్యాయ విచారణ జరపాలి: సీపీఐ

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో పలువురు ఆదివాసీలతోపాటు మావోయిస్టు అగ్రనేతను హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ ప్రకటించింది. తీవ్రవాద నిరోధక ఆపరేషన్ల ముసుగులో నిర్వహించిన చట్ట వ్యతిరేక చర్యకు సంబంధించిన మరో ఉదంతంగా తాజా ఎన్‌కౌంటర్‌ను అభివర్ణించింది. తాజా ఉదంతంతోపాటు మొత్తం ఆపరేషన్ కగార్‌పై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని సీపీఐ డిమాండు చేసింది. మావోయిస్టు అగ్రనేత ఆచూకీ గురించి విశ్వసనీయమైన నిఘా సమాచారం అధికారుల వద్ద ఉన్నపుడు చట్టపరంగా అరెస్టు చేయడానికి ఎందుకు ప్రయత్నించలేదని, రాజ్యాంగం ఇచ్చిన హామీలను బాహాటంగా ఎందుకు విస్మరించారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**ఎన్‌కౌంటర్ అప్రజాస్వామికం: కూనంనేని**

శాంతిచర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శిస్తున్నదని విమర్శించారు.

**వామపక్ష భావజాలాన్ని అంతం చేయడానికే : చాడ**

వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల కంటే దారుణంగా మన దేశ పౌరులైన మావోయిస్టులను కాల్చి చంపుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు.

### నరహంతక చర్య: సీపీఎం

*హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ):* ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు 27 మందిని కాల్చి చంపడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టులు, ప్రజాసంఘాలు, విపక్ష పార్టీలు అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, కేంద్రం మూర్ఖంగా నక్సలైట్లను, సానుభూతి పేరుతో గిరిజనులను కాల్చి చంపే నరహంతక చర్యలకు పాల్పడుతున్నదన్నారు.

### మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

**కాల్పుల విరమణ పాటించాలి..మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి**

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కూడా రజతోత్సవ సభలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో ఆపరేషన్ కగార్‌ను ఆపి, శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసిందని చెప్పారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు మాట్లాడారు. కర్రెగుట్టను వేలాది పోలీసు బలగాలు చుట్టుముట్టి ఆదివాసీలను, మావోయిస్టులను కేంద్రం హతమారుస్తున్నదని, బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని ఆరోపించారు. మనుషుల ప్రాణాలకు విలువలేకుండా చేయడం అనాగరికమని హరగోపాల్ పేర్కొన్నారు.

### ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ : న్యూడెమోక్రసీ

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తున్నదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పీ సూర్యం విమర్శించారు. అందులో భాగంగానే బుధవారం అబూజ్‌మడ్‌లో ప్రభుత్వ బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు 25 మందికిపైగా మృతి చెందారని పేర్కొన్నారు. అడవి నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి, అక్కడి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే కేంద్రం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందన్నారు.

### నంబాల కేశవరావుది ప్రభుత్వ హత్యే

**బీఆర్‌ఎస్ నేత చంటి క్రాంతి కిరణ్**

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): నంబాల కేశవరావుది ప్రభుత్వ హత్యే అని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. బుధవారం ఆయన ప్రధాని మోదీకి లేఖ రాసినట్టు ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతిపై సంతాపం ప్రకటించారు. ఇది ముమ్మాటికీ బీజేపీ ప్రభుత్వం చేసిన హత్యగానే పరిగణించాల్సి వస్తుందని తెలిపారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా.. పట్టించుకోకుండా ఏకపక్షంగా కాల్పులు జరిపి సాగించిన మారణకాండగా అభివర్ణించారు. మావోయిస్టులు ఆరు నెలలు కాల్పుల విరమణ ప్రకటించినా.. వారి అభ్యర్థనకు స్పందించకుండా మొండిగా వ్యవహరించి చేసిన ప్రభుత్వ హత్యలు ఇవని మండిపడ్డారు.

**మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి**

కేంద్రం వెంటనే కాల్పుల విరమణ తోపాటు మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతిచర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్‌చేశారు. బుధవారం హనుమకొండలో శాంతిచర్చల కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ మధ్య భారతలో పోలీసులు నక్సలైట్లకు మధ్య జరుగుతున్న అంతర్యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారని తెలిపారు.

# సోనియా, రాహుల్‌ది ఆర్థిక నేరమే!

- రూ.142 కోట్ల అనుచిత లబ్ధి పొందారు
- ఇది ముమ్మాటికీ మనీ లాండరింగ్ కిందికే వస్తుంది
- 'నేషనల్ హెరాల్డ్' కేసులో ఈడీ సంచలన ఆరోపణలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకొన్నది. ఈ కేసు విషయంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ సంచలన ఆరోపణలు చేసింది. వీరు రూ. 142 కోట్ల మేర అనుచిత లబ్ధి పొందారని ఈడీ ఆరోపించింది. 2023 నవంబర్‌లో రూ. 751.9 కోట్ల మేర ఆస్తులను తాము జప్తు చేసేంతవరకూ సోనియా, రాహుల్ ఈ నేరపూరిత చర్యలను కొనసాగించినట్టు ఈడీ ఆరోపించింది. ఇది ఆర్థిక నేరం కిందికే వస్తుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ తన వాదనను వినిపించింది.

**ప్రజల సొమ్ము పక్కదారి..**

కాంగ్రెస్ పార్టీకి విరాళాల పేరిట ప్రజల నుంచి సేకరించిన సొమ్మును వాణిజ్య అవసరాలకు ఉద్దేశించిన కంపెనీలో పెట్టినట్టు విచారణ సందర్భంగా ఈడీ ఆరోపించింది. ఇక్కడ ప్రజలే బాధితులుగా మారినట్టు వెల్లడించింది. ప్రజల సొత్తును వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోవడానికి 'యంగ్ ఇండియా' అనే కంపెనీని ఏర్పాటు చేశారని ఈడీ గుర్తు చేసింది. అలా ఈ కంపెనీ ద్వారా రూ. 2000 కోట్ల విలువైన ఏజేఎల్ సంస్థ ఆస్తులపై హక్కులు సాధించినట్టు ఆరోపించింది. ఈ క్రమంలో అద్దె, ఇతరత్రాల రూపంలో రూ. 142 కోట్లను సోనియా, రాహుల్ అయాచితంగా పొందారని తెలిపింది. ఇది ముమ్మాటికీ మనీలాండరింగ్ కిందకే వస్తుందని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో రాహుల్, సోనియాతో పాటు శామ్ పిట్రోడా, సుమన్ దూబే తదితరులు కూడా మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు పేర్కొంది. ఈడీ దాఖలు చేసిన అభియోగాలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం జూలై 2 నుంచి జూలై 8 వరకూ ప్రతీరోజూ ఈ కేసును విచారిస్తామని వెల్లడించింది.


**అసలేమిటీ కేసు?**

నేషనల్ హెరాల్డ్ పత్రికను 1938లో నెహ్రూ, పలువురు స్వాతంత్ర్య సమరయోధులు కలిసి ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ప్రచురణ సంస్థ నేషనల్ హెరాల్డ్‌ను ప్రచురించేది. నేషనల్ హెరాల్డ్ సంస్థ బకాయిలు పేరుకుపోవడంతో 2008లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కాగా, 2010లో కాంగ్రెస్ ఏజేఎల్ సంస్థకు రూ.90 కోట్ల మేర రుణాలు ఇచ్చింది. 2010 నవంబర్‌లో ఆ రుణాలను వసూలు చేసుకొనే హక్కును రూ. 50 లక్షలకే యంగ్ ఇండియా అనే కంపెనీకి కట్టబెట్టింది. అలా ఏజేఎల్‌కు చెందిన 99% షేర్లు యంగ్ ఇండియాకు బదిలీ అయ్యాయి. యంగ్ ఇండియాలో సోనియా, రాహుల్‌కు 76% షేర్లు ఉన్నాయి. యంగ్ ఇండియా కంపెనీ కేవలం రూ. 50 లక్షలు చెల్లించి, రూ. 90.25 కోట్ల విలువైన ఏజేఎల్ సంస్థ ఆస్తులపై హక్కు సాధించిందని, ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 2వేల కోట్ల వరకు ఉంటుందని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి 2012లో కోర్టును ఆశ్రయించారు.

### కన్నడ రచయిత్రి బాను ముస్తాక్‌కు బుకర్ ప్రైజ్

**'హార్ట్ ల్యాంప్' కథలకు ప్రతిష్ఠాత్మక పురస్కారం**

లండన్/న్యూఢిల్లీ, మే 21: కర్ణాటకకు చెందిన రచయిత్రి, సామాజిక కార్యకర్త, న్యాయవాది బాను ముస్తాక్ (77) ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. 'హార్ట్ ల్యాంప్' అనే 12 చిన్న కథల సంకలనానికి గాను ఆమెను ఈ బహుమతి వరించింది. 1990-2023 మధ్య కాలంలో ఈ కథలను రాసిన బాను ముస్తాక్ మంగళవారం రాత్రి లండన్‌లోని టేట్ మోడరన్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన కార్యక్రమంలో తన అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి ఈ బహుమతిని అందుకున్నారు. దీని కింద బాను ముస్తాక్‌కు 50 వేల పౌండ్లు లభించాయి. దీంతో ప్రతిష్ఠాత్మక



అంతర్జాతీయ బుకర్ ప్రైజ్‌ను అందుకున్న తొలి కన్నడ రచయిత్రిగా ఆమె ఘనత సాధించారు. ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను ముస్తాక్ పాఠశాల విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే తొలిసారి ఓ చిన్న కథను రాశారు. ఆ తర్వాత 26 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు బాను ముస్తాక్ రాసిన ఓ కథ పత్రికలో ప్రచురితమవడంతో ఆమె ప్రతిభ వెలుగులోకి వచ్చింది.